# 23rd International Women's Day Celebrations

08.03.2018

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ద్రావిడ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియం సెమినార్ హాలులో ఘనంగా జరుపుకున్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రథమ మహిళ ఆచార్య పి.బి.దేవకి గారి అధ్యక్షతన, వర్సిటీ ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ డా.జయలలిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ గారు, ప్రత్యేక అతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.తిరుపతిరావు గారు, విశిష్ట అతిథులుగా డిఆర్‌డబ్ల్యూ కళాశాల, గూడురు స్పెషల్ ఆఫీసర్ డా.కె.మెహర్‌మని, స్త్రీవాద రచయిత్రి, కవయిత్రి డా.మమతా జి సాగర్, భారతీదాసన్ యూనివర్సిటీ, తిరుచ్చి, విద్యావేత్త డా.అముతలు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆచార్య ఇ.సత్యనారాయణ గారు మాట్లాడుతూ... ద్రావిడ విశ్వవిద్యాలయంలో నూతన ఆడిటోరియంలోని సెమినార్ హాలులో మొట్టమొదటగా అంతర్జాతీయ మహిళా దినోత్సం సంబరాలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో స్త్రీపై వివక్ష తొలగాలని, టి.వి సీరియళ్ళలో అత్తాకోడళ్ళను శత్రువులుగా చూపిస్తూ సమాజానికి తప్పుడు సందేశం పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సభాధ్యక్షులు ఆచార్య పి.బి.దేవకి గారు మాట్లాడుతూ... మంచి అన్న పదానికి నిర్వచనం ఇస్తూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంచి మానవుడికి ఉండవలసిన లక్షణాలను, గుణగణాలను తెలుపుతూ స్త్రీలు కూడా మంచి గుణాలు అలవర్చుకుని ఆత్మస్థైర్యంతో ఉన్నత స్థానానికి చేరుకుని సమకాలీనులతో పాటు తరువాత తరాల వారికి మార్గదర్శకులుగా ఉండాలని కోరారు.

డా.కె.మెహర్‌మని గారు మాట్లాడుతూ... మొదట కుటుంబంలో స్త్రీలు తోటి స్త్రీని గౌరవించినట్లైతే తద్వారా సమాజంలో కూడా స్త్రీకి గుర్తింపు, ఆదరణ లభిస్తుందని, తదనుగుణంగా స్త్రీలు మనోధైర్యంతో పురుషులలో సమానంగా ఏ రంగంలోనైనా రాణించగలుగుతారని అన్నారు. మహిళా సాధికారకతకు సంబంధించిన ప్రతి కార్యక్రమానికి పురుషులను కూడా ఆహ్వానించి, వారి ద్వారా ఈ కార్యక్రమాలు జరిపించినట్లైతే స్త్రీ పడుతున్న కష్టనష్టాలు, ఆవేదనలు పురుషులకు కూడా తెలుస్తాయని అప్పుడు వారిలో చాలా మార్పు కలుగుతుందని అన్నారు. సమాజంలో విద్యార్థినిలు, స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నింటినో ఉదహరించారు. స్త్రీలపై జరుగుతున్న అరాచకాలపై ఎన్ని చట్టాలు తెచ్చినా చాలా సమస్యలను చట్టాలు పరిష్కరించలేవని, ఈ సమస్యలను కేవలం విచక్షణా జ్ఞానంతో, సహృదయతతో రూపుమాపవచ్చున్నారు.

డా.మమతా జి సాగర్ గారు మాట్లాడుతూ... స్త్రీలు కాలానికి తగ్గట్లు, సమాజ పరిస్థితులకు తగ్గట్టు ప్రవర్తిస్తూ విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాలలో ప్రవేశించి ఉన్నత స్థానాలను అధిరోహించి స్త్రీ శక్తిని నిరూపించుకోవాలని కోరారు. పురుషులు స్త్రీని విమర్శిస్తున్నారు, స్త్రీని గుర్తించడంలేదు, ప్రోత్సహించడం లేదు అని నిరుత్సాహపడకుండా స్త్రీ ఏం సాధించాలి అన్న విషయం వైపు శ్రద్ధ పెట్టి సాధనకు కృషి చేయాలని అన్నారు. భారతదేశంలో ఝాన్సీ లక్ష్మీభాయి, ఇందిరా గాంధి మొదలైన వీర నారీమనుల గురించి సమాజానికి

తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పోస్టర్లలో, టివిలలో ఇచ్చే ప్రకటనలలో స్త్రీలను అవమానించే విధంగా, బాధించే విధంగా ఉన్నాయన్నారు. అన్ని మతాలను ఆదరిస్తున్న భారతదేశం స్త్రీ విషయం వచ్చినప్పుడు వివక్ష చూపడం తగదన్నారు. రచయిత్రి, జర్నలిస్టు అయిన గౌరీ లంకేశ్వర్ లాంటి మహిళలు గురించి స్త్రీకు తెలియజేయాల్సిన అవసరం ఉందని తెలుపుతూ ఆమెపై తీసిన లఘుచిత్రాన్ని ఈ సందర్భంగా ప్రదర్శించారు.

డా.ఎస్.అముతా గారు మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో స్త్రీలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నప్పటికీ సరైన అవకాశాల గురించి ఎదురు చూస్తున్నారే తప్ప వచ్చిన అవకాశాలను చేజిక్కించుకుని సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచనలో పురుషుల కంటే వెనుకపడుతున్నారని అన్నారు. స్త్రీలు పురుషులను అనుసరించి ప్రవర్తించడం మాని స్త్రీలను పురుషులు అనుసరించే విధంగా విద్యా, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ముందడుగు వేయాలని ఈ సందర్భంగా కోరారు. స్త్రీలు వారిని వారు రక్షించుకుంటూ ఇతర స్త్రీలను రక్షిస్తూ ఆత్మవిశ్వాసం, సంకల్పం కలిగి తాము సాధించిన ఘనతను సమాజానికి తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య బి.తిరుపతిరావు గారు మాట్లాడుతూ... సమాజంలో అన్ని మతాల వారు, అన్ని వర్గాల వారు సంతోషంగా ఉంటే సమాజం ఎలా ఎదుగుతుందో అదేవిధంగా పురుషుడితో పాటు స్త్రీ కూడా సంతోషంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం సంతోషంగా ఉంటుందని అన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ద్రావిడ విశ్వవిద్యాయలంలోని విద్యార్థినిలకు వ్యాస రచన, వకృత్వ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ద్రావిడ విశ్వవిద్యాలయ మహిళా అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.









